
సాక్షి నంద్యాల
మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



శుభగాత్రీ.. గిరిజాపుత్రి
శ్రీశైలంలో శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం వార్షిక కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాన్ని నిమ్మకాయలతో సుందరంగా అలంకరించారు. 8లో▸



ఊరంతా సంబరం
ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామంలో సిద్ధ రామేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా సాగాయి. సోమవారం వసంతోత్సవంతో గ్రామం కళకళలాడింది. 8లో▸



జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ
వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.అవినాష్ జయసింహ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అహోబిలం.. భక్తిపారవశ్యం

- శాస్త్రోక్తంగా స్వాతి మహోత్సవం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: శ్రీ ప్రహ్లాదవరదస్వామి జన్మనక్షత్రమైన 'స్వాతి'ని పురస్కరించుకుని సోమవారం దిగువ అహోబిలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందా నామస్మరణతో భక్తులు ప్రణమిల్లారు. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను, అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచారు. అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణ చేసి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పండితుల వేద మంత్రోచ్ఛారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో ఉత్సవాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి పల్లకీలో ఉత్సవమూర్తులు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

బైర్లూటి దర్గాలో వడగండ్ల వాన



ఆత్మకూరు: బైర్లూటి దర్గాలో సోమవారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దర్గాలోని సేమియాలు గాలులకు ఎగిసిపడ్డాయి. మండలంలోని వెంకటాపురం, ఎస్.ఎన్.తండా, సిద్ధాపురం తదితర గ్రామాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అయితే ఆత్మకూరులో ఒక్క చినుకు కూడా పడలేదు. నల్లమల అటవీ పరిధిలోని బైర్లూటీ నుంచి రోళ్లపెంట వరకు వర్షం కురిసింది.

శాస్త్రోక్తంగా పల్లకీసేవ



మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దేవిక ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ, అర్చకులు శరభయ్యశర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామి, అమ్మవారి పల్లకీసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అంబేడ్కర్ విగ్రహానికి వద్ద మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బొమ్మలసత్రం బ్రిడ్జి కింద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ రాజకుమారి, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దళితుల హక్కుల కోసం పోరాడిన అంబేడ్కర్ చిరస్మరణీయులన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. దేశానికి దశ, దిశ ఏర్పాటు చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించిన గొప్ప వ్యక్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మాబూన్నిసా, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వంక'ర కింకరులు!

- ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన టీడీపీ నాయకులు
- 16.50 ఎకరాల వంక పోరంబోకు భూమి కబ్జా
- అక్రమంగా మట్టి తోలి రహదారుల నిర్మాణం
- యథేచ్ఛగా మంత్రి అనుచరుల ఆక్రమణలు!
- ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు
- నకిలీ పత్రాలు సృష్టించి ఇష్టానుసారం మోసాలు

విలువైన ప్రభుత్వ భూములు ఉంటే చాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాబందుల్లా వాలిపోతున్నారు. స్థలమంతా తమదే అని హంగామా సృష్టిస్తున్నారు. ప్లాట్లు వేస్తున్నామని, తక్కువ ధరకే స్థలం ఇస్తామని 'రియల్' మోసం చేస్తున్నారు. వంక పోరంబోకు భూములను సైతం వదలడం లేదు. అధికారులను భయపెట్టిన 'అక్రమ' తంతు సాగిస్తున్నారు. నంద్యాల సమీపంలో వీరు చేస్తున్న పనులను చూసి ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. 'ప్రభుత్వ భూములే ఆక్రమిస్తుంటే చూడలేని ఇదేమి పాలన నాయనా' అని అవాక్కవుతున్నారు.



వంక భూమిని ఆక్రమించి రోడ్డు వేసిన దృశ్యం



వంక భూమిలో వేసిన ప్లాట్లు

నంద్యాల(అర్బన్): వంక పోరం బోకు భూములను టీడీపీ నేతలు ఆక్రమించారు. అంతేకాకుండా అందులో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా టీడీపీ నాయకులే కదా అని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నల్లమల కొండల నుంచి వచ్చే వర్షపు నీరు మహానంది మండలం నందిపల్లె వద్ద రెండు పాయలుగా విడిపోతుంది. పెద్దకొట్టాల గ్రామ సమీపంలో పాలేరు వాగుగా, అయ్యలూరు గ్రామం చిన్న చెరువు సమీపంలో అయ్యలూరు వాగుగా ప్రవహిస్తోంది. చెరువు సమీపం నుంచి వచ్చే వాగు దాదాపు 65 అడుగుల వెడల్పు, 3.50 కి.మీ పొడవు ఉంది. అయ్యలూరు మెట్ట సమీపంలో ఉన్న శ్రావణలక్ష్మి సీడ్ ప్లాంట్, న్యూ వెంకటేశ్వర సీడ్ ప్లాంట్ల మీదుగా చాబోలు బైపాస్ కింద వెళ్తూ రైతునగర్, కానాల, గోస్పాడు మండలం చింతకుంట్ల మీదుగా కుందూలో కలుస్తోంది. చాబోలు బైపాస్ వరకు దాదాపు 16.50 ఎకరాల వంక పోరంబోకు భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పలు రకాల సర్వే నంబర్ల ద్వారా ఎన్నో ఏళ్లుగా పలువురు రైతులు ఎకరం, అర ఎకరం సాగు చేసుకుంటూ వస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవడంతో టీడీపీ నాయకులు బరితెగించారు. జాతీయ రహదారి సమీపాన ఉన్న సర్వే నంబరు 21/1లోని 1.99 ఎకరాల భూములను ప్రొక్లెయిన్‌ల ద్వారా చదును చేశారు.

మంత్రి అనుచరులే!

నంద్యాల మండలంలోని చాబోలు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ప్రస్తుతం సెంటు విలువ బహిరంగ మార్కెట్లో రూ.12లక్షల నుంచి రూ.15లక్షలు పలుకుతోంది. రహదారి సమీపంలో వంక పోరంబోకు స్థలాన్ని ఆక్రమించిన మంత్రి ఫరూక్ అనుచరులు కొందరు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా మంత్రి అనుచరులకే కదా అంటూ సమస్యను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన 37మంది భవన నిర్మాణ మేస్త్రీలకు మంత్రి ద్వారా పట్టాలు ఇస్తామంటూ సెంటు రూ.2లక్షలు చొప్పున అమ్మకాలకు పెట్టారు. రహదారులు నిర్మించడమే కాకుండా హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. నేషనల్ హైవేకు సమీపాన ఉండటంతో స్థలాలు హాట్ కేక్‌ల్లా అమ్ముడయ్యాయి.

ఇవీ కష్టాలు..

అయ్యలూరు గ్రామ సమీపం నుంచిచాబోలు బైపాస్ రోడ్డు వరకు దాదాపు 16.50 ఎకరాల వంక పోరంబోకు భూములు ఉన్నాయి. వంక సమీపాన ఉన్న రైతులు ఏడాదికింత చదువును చేస్తూ వెళ్లారు. దీంతో 65 అడుగుల మేర వెడల్పు ఉన్న వంక ఏడాదికేడాది కుచించుకపోతూ వచ్చింది. పలువురు రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వే నంబర్లు సృష్టించుకొని పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి అనుచరులు కొందరు పోరంబోకు భూములను ఆక్రమించుకున్నారు. కాల్వ వెడల్పు తగ్గడంతో వర్షా కాలంలో పై నుంచి ఉధృతంగా వచ్చే వర్షపునీరు పారేందుకు కాల్వ సరిపోకపోవడంతో సమీప ప్రాంతాల్లోని పంటల పొలాలను ముంచెత్తుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

> **ప్రస్తుతం దుస్థితి ఇదీ..**
>
> జిల్లాలో వంక, ప్రభుత్వ పోరంబోకు, సీలింగ్, ఇతర ఖాళీ స్థలాలు కనపడితే చాలు టీడీపీ నాయకులు కబ్జా చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఇలాంటి ఆక్రమణలు జరుగుతున్నా నివారించాల్సిన రెవెన్యూ వ్యవస్థ నిద్రావస్థలో ఉన్నట్లు కనిపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఆక్రమణల విషయం తెలిసినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ఉద్యోగ భద్రతలో నిమగ్నమయ్యారు. మరి కొంత మంది తహసీల్దార్లు కాసులకు కక్కుర్తి పడుతూ ఆక్రమణ దారులకు పరోక్ష సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా చేశారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నంద్యాల మండలం చాబోలు గ్రామం బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న వంకపోరం బోకు భూమిలో కొంత మంది ఆక్రమణ దారులు పెద్ద షెడ్లను ఏర్పాటు చేశారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ఆక్రమణలు వెలుగు చూడటంతో స్పందించిన ప్రభుత్వం రెవెన్యూ అధికారుల ద్వారా షెడ్లను కూల్చివేయించింది. ఆక్రమణ దారుల భరతం పట్టింది.

విచారణ జరుపుతాం

నంద్యాల మండలం చాబోలు బైపాస్ వద్ద వంకపోరంబోకు ఆక్రమణల విషయం మా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసులు, నంద్యాల తహసీల్దార్

పార్వేట గుర్రంపై రంగనాథుని విహారం



పార్వేట గుర్రం వద్ద పద్యాలు పాడుతున్న భక్తులు

జూపాడుబంగ్లా: బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం శ్రీలక్ష్మీరంగనాథునిస్వామి వారు పార్వేట గుర్రంపై విహరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో అధిష్ఠింపజేశారు. పార్వేట గుర్రాన్ని తీసుకొని పాతరంగస్వామి దేవాలయం సమీపంలో పార్వేట గొర్రెను వదిలిపెట్టారు. అనంతరం పాతరంగనాథ స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పార్వేట గుర్రంతో పాటు స్వామివారిని తీసుకొని పద్యాలను పాడుకుంటూ దేవాలయానికి చేరారు.

నేటి నుంచి చేపలవేట నిషేధం

శ్రీశైలం ప్రాజెక్ట్: మత్స్యసంపద అభివృద్ధి కోసం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు రాష్ట్రం వ్యాప్తంగా చేపల వేటను ప్రభుత్వం నిషేధించింది. చేపల పునరుత్పత్తి ఈ రెండు నెలల్లో అధికంగా ఉంటుంది. మత్స్యకారులు వేట కొనసాగిస్తే పెద్ద చేపలతో పాటు చిన్న చేపలు కూడా అంతరించే ప్రమాదం ఉంది. కృష్ణా నదీ తీరం వెంట, శ్రీశైలండ్యాం ఎగువ, దిగువ ప్రాంతాల్లో చేపల వేటకు మత్స్యకారులు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్రాణం తీసిన వాటర్ ఫిల్టర్ బెడ్ గుంత

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



మృతి చెందిన అయాన్

నంద్యాల: పట్టణంలోని మున్సిపల్ పార్కులో వాటర్ ఫిల్టర్ బెడ్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో పడి ఒక బాలుడు మృతి చెందాడు. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన మన్సూర్, రజియా కుమారులు అయాన్, అలీ మున్సిపల్ పార్కులో సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో క్రికెట్ ఆడుకుంటున్నారు. బ్యాటింగ్ చేస్తుండగా బాల్ ఎగిసిపడి వాటర్ ఫిల్టర్ బెడ్‌కు తీసిన గుంతలో పడిపోయింది. ఈ బాల్‌ను తీయడానికి తమ్ముడు అయాన్ గుంతలో దిగారు. గుంతలో పడి తమ్ముడు మునిగిపోవడాన్ని గమనించిన అన్న అలీ పైకి తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గుంతలో పడి అయాన్(7) మృతి చెందాడు. తమ్ముడిని బయటకు తీయడానికి ప్రయత్నించిన అన్న కూడా నీటి గుంతలో పడటంతో చుట్టుపక్కలున్న వారు గమనించి రక్షించారు. అయాన్ గుంతలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అక్కడి వచ్చి విలపిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇస్మాయిల్ తెలిపారు.



బాలుడి మృతికి కారణమైన వాటర్ ఫిల్టర్ బెడ్ గుంత

మున్సిపల్ అధికారులే నిర్లక్ష్యమే కారణమా?

పట్టణంలోని మున్సిపల్ పార్కుకు ప్రతి రోజూ వందలాది మంది వస్తుంటారు. ఈ పార్కులో ఈ మధ్యకాలంలో వాటర్ ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం ఫిల్టర్ బెడ్ చుట్టూ 4 నుంచి 5 అడుగుల గుంత తీశారు. గుంత పనులు పూర్తి కాలేదు. వందలాది మంది ప్రజలు పార్కుకు వస్తుంటారని తెలిసినా గుంత చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో ఆడుకోవడానికి వచ్చిన అయాన్ గుంతలో పడి మృతి చెందడంతో స్థానికులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ అజాగ్రత్తతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో గుంత పనుల విషయాల్లో జాగ్రత్తలు తీసుకోకుండా చిన్నారి మృతికి కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులే కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

- నంద్యాలలో ముస్లింల భారీ ర్యాలీ
- మద్దతు ఇచ్చిన సీపీఎం, సీపీఐ, ప్రజా, కుల సంఘాలు



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నంద్యాల(అర్బన్): అనేక లొసుగులతో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు మహమ్మద్ అబులైజ్ అన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ అధ్యక్షతన పట్టణంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ముస్లింలకు సీపీఎం, సీపీఐ, ప్రజా, కుల సంఘాలు మద్దతు పలికాయి. పట్టణంలోని గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైజ్, కన్వీనర్ మౌలానా అబ్దుల్ రషాదీ మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు ఆయా ప్రభుత్వాల నియంత్రణలో మంత్రుల నిర్వహణలో ఉన్నది వాస్తమన్నారు. వక్ఫ్ బోర్డు నుంచి ముస్లిం పేదలకు సాయం అందకపోవడానికి ప్రభుత్వాలే కారణమని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చారన్నారు. ముస్లింల పూర్వీకుల ఆస్తులను కాజేసేందుకు తాజాగా కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగ విలువలకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తిలోదకాలు ఇచ్చిందన్నారు. జేపీసీ ఏకపక్షంగా సవరణ బిల్లును పార్లమెంట్ ముందు ఉంచగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తమ ఎంపీల ఓట్లు వేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకొనే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల నుంచే 'కూటమి' ఓటమి

ముస్లిం జేఏసీకో కన్వీనర్ మస్తాన్ ఖాన్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. జేఏసీ నాయకుడు అబ్దుల్‌సమ్మద్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు ఇస్తారేమోనని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న 'కూటమి' ప్రభుత్వం ఓటమి నంద్యాల నుంచే ప్రారంభమవ్వాలని అన్నారు. వచ్చే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నాయకులకు గుణపాఠం చెబుతూ ముస్లింల తడాఖా చూపాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ..లౌకిక వాదంతో ఏర్పాటు అయిన టీడీపీని చంద్రబాబునాయుడు స్వప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. జేఏసీ ట్రెజరర్ ఆడిటర్ బాషా, సభ్యులు ఎజాజ్ హుసేన్, షమీర్, సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, సీపీఎం నాయకులు గౌస్, హాఫీజ్ వాహిద్ హుసేన్, యూత్ సభ్యులు సయ్యద్ ప్యారే రసూల్, అయూబ్, వశీం, ఇబ్రహీం, సుహేల్, అడ్వకేట్ అసదుల్లా తదితరులు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును ప్రభుత్వం వెనక్కు తీసుకోకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జేఏసీ సభ్యులు మౌలానా ఇద్రూస్, ఐయూ ఎంఎల్ మౌలాలా అబ్దుల్‌సలాం, ఇమామ్‌లు జక్కీవుల్లా, జాకీర్, ఇషాక్, ఎస్‌కే యూనస్, అర్షద్, గులాబ్ ఖాశీం, మునీర్, అమీరుద్దీన్, అబ్దుల్లా షేక్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో ఘోర రోడ్డు ప్రమాదం

అక్కడికక్కడే ముగ్గురి మృతి

- మృతులు నంద్యాల జిల్లా వాసులుగా గుర్తింపు
- ఇద్దరికి తీవ్ర గాయాలు





తేజ నాయుడు, వినోద్(ఫైల్)



స్కార్పియో వాహనంలో మృతదేహాలు

ఒంటిమిట్ట/నంద్యాల: వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సోమవారం నెత్తురోడింది. స్కార్పియో, బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి నుంచి నంద్యాలకు వెళ్తున్న స్కార్పియో(ఏపీ31 సిడబ్ల్యు 7479) వాహనం ఒంటిమిట్ట మండల పరిధిలోని నడింపల్లి వద్దనున్న కడప-చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే తిరుపతికి వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు(ఏపీ 39 యుఎం 9771)ను వేగంగా ఢీకొంది. స్కార్పియో పల్టీకొట్టి ఎలక్ట్రిక్ బస్సు వెనుక వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని కూడా ఢీ కొట్టింది. ప్రమాదంలో స్కార్పియోలోని నలుగురిలో తేజనాయుడు(19), ధర్మారెడ్డి(26), వినోద్(25)లు అక్కడికక్కడే మరణించారు. మహానంది పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సునిల్‌నాయుడుకి తీవ్రగాయాలు అయ్యాయి. ఇతనితో పాటు పెట్రోలింగ్ వాహనం నడుపుతున్న కానిస్టేబుల్ రఘురాంరెడ్డి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు ధర్మారెడ్డిచేత మద్యం మాన్పించేందుకు తిరుపతికి నాటుమందు కోసమని వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు చేరవేయడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఘటనపై రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న స్కార్పియో వాహనం

మృతుల వివరాలు

- తేజనాయుడు స్వస్థలం నంద్యాలలోని హౌసింగ్ బోర్డు కాలనీ. తల్లిదండ్రులు భద్ర, రాజేశ్వరి. ఇతను పట్టణంలోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు.
- వినోద్ స్వస్థలం బండిఆత్మకూరు మండలంలోని సోమయాజులపల్లె. తల్లిదండ్రులు వెంకటలక్ష్మమ్మ, వెంకటరాముడు. టవర్ల వద్ద జనరేటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.
- ధర్మారెడ్డి స్వస్థలం చాగలమర్రి మండలం డి.కొత్తపల్లె. తండ్రి శివశంకర్‌రెడ్డి వ్యవసాయం చేస్తుండగా, తల్లి అన్నమ్మ ఉన్నారు. నంద్యాలలోని జియో కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల అక్క జ్యోతి వివాహం కాగా, తమ్ముడు శ్రీనివాసరెడ్డి ట్రాన్స్‌ఫారం కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

> **స్కార్పియో మితిమీరిన వేగమే కారణం**
>
> రోడ్డు ప్రమాద స్థలాన్ని కడప ఆర్టీసీ ఆర్ఎం పి.గోపాల్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ ఉన్న పరిస్థితిని చూస్తే స్కార్పియో వాహనం నడిపిన వారిదే తప్పుగా తెలుస్తోందన్నారు. మితిమీరిన వేగంతో బస్సు మోటును ఢీకొట్టడంతో స్పీడ్ మీదు తిరుగుకుంటూ వెళ్లి బస్సు వెనుక వైపు వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టి ఉంటారన్నారు. పూర్తిగా తెలుసుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సుకు ఉన్న సీసీ పుటేజీని పరిశీలిస్తామని తెలిపారు.

జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ


అగ్నిమాపక వారోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

కర్నూలు: వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.అవినాష్ జయసింహ అన్నారు. కర్నూలు కేంద్ర అగ్నిమాపక సహాయ అధికారి వై.చిన్నబజారి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి డీఎఫ్ఓ అవినాష్ జయసింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్నిమాపక, రక్షణ కార్యకలాపాలను నిర్వహిస్తూ మరణించిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పిస్తూ రెండు నిముషాలు సంతాపం పాటించి స్మారక కవాతు నిర్వహించారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడుతూ 'అవగాహన పెంచుదాం సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమం ద్వారా అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. అగ్నిప్రమాదం సమయంలో ప్రతి నిముషం ఎంతో విలువైనదని, ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


చాకలి అనిల్ (ఫైల్)

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. బాధిత కుటుంబంలో విషాదం నింపిన ఈ ఘటన వివరాలు చాగలమర్రి ఎస్ఐ సురేష్ తెలిపిన మేరకు.. మండలకేంద్రం చాగలమర్రిలోని వినాయకనగర్‌కు చెందిన చాకలి అనిల్ (30) అనే యువకుడు స్థానిక మెడికల్ స్టోర్‌లో పనిచేస్తాడు. సోమవారం సొంత పని మీద ముత్యాలపాడుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గోడిగనూరు సమీపంలో కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ప్రాణాలు విడిచాడు. ఈ మేరకు తండ్రి సుబ్బన్న ఫిర్యాదుతో ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు వెల్లడించారు.

రైల్వే స్టేషన్ తనిఖీ


స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ సుధేష్ణసేన్ సోమవారం పనులను పరిశీలించా రు. అమృతభారత్ పథకం కింద జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా స్టేషన్ ఎదుట చిరువ్యాపారాలు చేసుకునే వారిని ఖాళీ చేయించవద్దని సీపీఎం నాయకులు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

శుభగాత్రీ.. గిరిజాపుత్రి

- శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి వార్షిక కుంభోత్సవం
- నాటి చెంచుల ఉత్సవం.. నేడు సకల జనుల వేడుక
- అమ్మవారి నిజరూపదర్శనంతో పులకించనున్న భక్తజనం
- మల్లన్నకు అన్నాభిషేకం


ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబదేవి


నిమ్మకాయలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించిన దృశ్యం


నిమ్మకాలను మాలగా కుడుతున్న మహిళలు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశశక్తి పీఠాలలో ఒకటైన శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం వార్షిక కుంభోత్సవం నిర్వహించేందుకు దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. స్థానికులైన చెంచులకు అతి ముఖ్యమైన ఉత్సవం అమ్మవారి వార్షిక కుంభోత్సవం. చెంచుల ఆచారాలు, సంప్రదాయాలు నేడు కనుమరుగవుతుండగా, చెంచుల ఉత్సవం ఇప్పుడు సకల జనులందరి కుంభోత్సవంగా మారింది. 6వ శతాబ్దంలో సాక్షాత్తు ఆదిశంకరులే వామాచార (బలుల) సంప్రదాయానికి స్వస్తి చెబుతూ దక్షిణాచార (సాత్వికబలి) సంప్రదాయాన్ని కొనసాగేలా అమ్మవారి ఉగ్రరూపాన్ని ఉపసంహరించి శ్రీచక్రాన్ని ఏర్పాటు చేశారని పురాణాలు చెబుతున్నాయి. ఉగాది తర్వాత వచ్చే మొదటి పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారాలలో ఈ కుంభోత్సవం నిర్వహిస్తారు. శ్రీశైల మహాక్షేత్రంలో దాదాపు 2000 సంవత్సరం వరకు కూడా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, కోటగోడ అమ్మవారి వద్ద కోళ్లు, మేకలను బలి ఇచ్చేవారు. అనంతర కాలంలో జంతు సంరక్షణ సమితితో పాటు మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు, జంతుప్రేమికులు జంతు బలులను నిషేధించాలని విన్నవించారు. దీంతో దేవస్థానం పరిధిలో జంతు బలులు నిషేధిస్తూ దేవదాయ చట్టం రావడంతో కాలక్రమేణా సాత్వికబలి దిశగా ఈ కుంభోత్సవం చేరుకుంది. ప్రస్తుతం సాత్వికబలి ఇవ్వడం అనవాయితీగా మారింది. ఇందులో భాగంగా వేలకొద్ది నిమ్మకాయలు, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు సమర్పిస్తున్నారు. దేవస్థానం వారితో పాటు స్థానికులు, వ్యాపారులు గ్రామం, ఊరు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వందల కేజీల అన్నం, పెసరపప్పుతో కూడిన కుంభాన్ని అమ్మవారికి సమర్పిస్తున్నారు.


సాత్విక బలికి సిద్ధంగా ఉంచిన గుమ్మడి కాయలు

కాలానుగుణంగా మార్పు

సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలు, వ్యవహారాలలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. చెంచులు నాగరికత దిశగా అడుగులు వేయడంతో నాటి సంప్రదాయాలు, సంస్కృతి నేడు మనకు కనిపించడం లేదు. అలాగే గతంలో స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పాలుట్ల నుంచి ఓ యువతి దీపం తీసుకువచ్చేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ ఆచారం కనిపించడం లేదు. దీనికి బదులుగా స్వామివారి ఆలయంలో పనిచేస్తున్న వ్యక్తి మహిళా వేషధారణలో దీపంతో అమ్మవారి ఆలయానికి చేరుకుని కుంభహారతి ఇస్తారు. ఏడాదిలో 365 రోజులలో ఈ కుంభోత్సవం ఒక్క రోజు మాత్రమే అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు లభిస్తుంది. అయితే అమ్మవారు ఉగ్రరూపంలో ఉండడంతో కుంభహారతి ఇవ్వగానే భ్రమరాంబాదేవి మూలవిరాట్‌పై పసుపు, కుంకుమలను ఏకధాటిగా చల్లి అమె క్రోధ నేత్రాల చూపులు భక్తులపై ప్రసరింపజేయకుండా చేస్తారు.

నిజరూప దర్శనం..

ఎనిమిది చేతులలో వివిధ ఆయుధాలను ధరించి ఉన్న భ్రమరాంబాదేవి వారు రోజూ అలంకారమూర్తిగా దర్శనమిస్తారు. అమ్మవారికి స్వర్ణముఖకవచం అలంకరించి ఉంటుంది. అయితే సంవత్సరంలో ఒక్క కుంభోత్సవం రోజున మాత్రమే అమ్మవారి ముఖానికి కవచాలంకరణ ఉండదు. ఆ రోజున భక్తులు అమ్మవారి నిజరూప దర్శనాన్ని చేసుకోవచ్చు. అమ్మవారి నిజరూప దర్శనముతో భక్తులందరూ పులకించిపోతారు. భక్తుల దర్శనాలు పూర్తయ్యాక రాత్రి 10 గంటల సమయంలో అమ్మవారికి పునఃపూజలు చేసి 9 రకాల పిండివంటలతో చేసే మహానివేదన చేయనున్నారు.

నేడు శ్రీశైల ఆలయంలో పూజలు ఇలా..

కుంభోత్సవం రోజున అమ్మవారికి ప్రాతఃకాల పూజలు యథావిధిగా జరిపించబడతాయి. తరువాత అర్చకులు నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ, అష్టోత్తరపూజలను, జపపారాయణలను చేస్తారు. అయితే సంప్రదాయాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంలో నిర్వహిస్తారు. కుంభోత్సవం కారణంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. సాయంత్రం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. కుంభోత్సవంలో భాగంగా సాయంత్రం స్వామివారి ప్రదోషకాల పూజల అనంతరం విశేషంగా అన్నాభిషేకాన్ని జరిపిస్తారు. అనంతరం స్వామివారి మూలమూర్తిని పూర్తిగా పెరుగన్నంతో కప్పివేస్తారు. స్వామివారి ఆలయ ద్వారాలు మూసివేయబడతాయి.

వడదెబ్బతో ఉపాధి కూలి మృతి


మృతి చెందిన అడవి లక్ష్మన్న (ఫైల్)

పత్తికొండ రూరల్: హోసూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ అడవి లక్ష్మన్న (58) సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు. ఉదయం భార్య లక్ష్మీదేవితో కలిసి ఉపాధి పనులకు వెళ్లి కూలీలతో కలిసి కుంట తవ్వకం పనిచేసుకుంటూ ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఇంటికి తీసుకొచ్చేలోగానే మృతి చెందినట్లు ఉపాధి కూలీలు తెలిపారు. పనిప్రదేశంలో ఉపాధి కూలీలకు టెంట్లు, నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా లాంటి సౌకర్యాలు కల్పించకపోవడం కూలీలు వడదెబ్బకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

శిరివెళ్ల: గుంప్రమాన్‌దిన్నె- యర్రగుంట్ల రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంప్రమాన్‌దిన్నెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూటి రేణుకుశవరెడ్డి (32) మృతి చెందాడు. ఈ నెల 13న స్వగ్రామం నుంచి యర్రగుంట్లకు బైక్‌పై వస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలలో పడి మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున వాకింగ్‌కు వచ్చిన వ్యక్తులు చూసి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని గోపాల్‌రెడ్డిని పరామర్శించరు.

రిమాండ్‌కు సెల్ దొంగలు


దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

డోన్ టౌన్: చోరీచేసిన 52 సెల్‌ఫోన్‌లు, 40 లీటర్ల నాటుసారాను కారులో తరలిస్తుండగా ఈ నెల 11వ తేదీ డోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. నిందితులు నగనూరి వంశీ, హాజీవలి అలియాస్ అజ్జూ, నగనూరి వసంత అనే ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సోమవారం జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ నరేంద్రకుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

- రంగంలోకి ఫోరెన్సిక్ అధికారులు, డాగ్‌స్క్వాడ్


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మహానంది: మహానంది సమీపంలోని అరటి పొలాల్లో గుర్తు తెలియని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నిప్పటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడా...? లేక ఎవరైనా ముందే హతమార్చి తీసుకొచ్చి నిప్పటించారా...? అనే విషయాలు తేలాల్సి ఉంది. నంద్యాల - మహానంది రహదారిలో ఎన్‌టీఆర్ విగ్రహం ఎదురుగా ఉన్న అరటి తోటల్లో ఉదయం మంటలు కనిపించడంతో కొందరు వెళ్లి చూడగా ఓ వ్యక్తి తగలబడుతున్నట్లు గుర్తించారు. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, మహానంది, బండిఆత్మకూరు ఎస్ఐలు రామ్మోహన్ రెడ్డి, జగన్‌మోహన్‌లు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం నంద్యాల జిల్లా ఫోరెన్సిక్ అధికారులు మృతదేహం వద్దకు చేరుకుని ఆధారాలు సేకరించే క్రమంలో వేలిముద్రలు, మృతుడు ధరించిన ఆంజనేయస్వామి డాలర్, కొన్ని కీలక భాగాలు సేకరించారు. వ్యక్తి అనుమానాస్పద మృతిపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ ఆరా తీసినట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. కుడికాలికి నల్లని ధారం, బట్టతల ఉండటంతో పాటు వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా మృతి చెందిన వ్యక్తి టవల్‌తో అరటిచెట్టుకు నడుమును కట్టినట్లు కనిపించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది తెలిస్తే కానీ పూర్తి వివరాలు తెలియని పరిస్థితి నెలకొంది. మృతదేహానికి ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించి మహానందిలోనే అంత్యక్రియలు పూర్తి చేశారు.

గొడుగు బాగుందండి!



సూర్యుడు సుర్రుమంటున్నా తగ్గేదేలా అంటూ జనం మాత్రం జాగ్రత్తలు తీసుకుంటూ బయట పనులు చేసుకుంటున్నారు. కర్నూలు నగరంలో ఓ వ్యక్తి తన స్కూటీకి గొడుగులా ఏర్పాటు చేసుకుని రయ్..రయ్‌మంటూ దూసుకెళ్తున్నాడు. ఎండ తగులకుండా పైన గొడుగులా, ప్రయాణించే సమయంలో వడ గాలులు ముఖానికి తాకకుండా పారదర్శకంగా ఉండే షీట్‌ను అమర్చుకున్నాడు. గొడుగు బండిని చూసిన వాహనదారులు చూస్తూ భలే ఉందంటూ చర్చించుకుంటున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

లారీని ఢీకొని బాలుడి మృతి


రుషిబాబు (ఫైల్)

వెల్దుర్తి: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై స్థానిక లిమ్రాస్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. పట్టణంలోని ఐజీ నగర్‌కు చెందిన గౌండ రమేశ్, సుజాత దంపతులు గేదెలు పెంచుకుంటూ పాలు విక్రయిస్తూ జీవిస్తున్నారు.వీరికి ఇద్దరు రుషిబాబు(14), విక్కీబాబు కుమారులు. సోమవారం తెల్లజామున వినియోగదారులకు పాలు పోసి వస్తానంటూ తమ్ముడుతో బైక్‌పై వెళ్లాడు. అయితే ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఓవర్ టేక్ చేయబోతుండగా వాహనం ఢీకొనడంతో రుషిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ విక్కీ బాబును కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. రుషిబాబు కృష్ణగిరి మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంట్లో చెప్పకుండా బైక్ తీసుకెళ్లి ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన వడ్డే రమేష్

డోన్ రూరల్: కామగానిగుంట్ల గ్రామానికి చెందిన వడ్డే రమేష్ (40) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని తన సొంత తోటలో నీరు వదలడానికి మోటర్ స్విచ్ ఆన్ చేస్తుంగా కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన రమేష్ ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబీకులు అనుమానంతో పొలం వద్దకు వెళ్లి చేశారు. బోరు వద్ద విగత జీవిగా పడి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

యువకుడి దుర్మరణం

- పుదుచ్చేరి వద్ద రోడ్డు ప్రమాదం


పవన్‌కల్యాణ్(ఫైల్)

కోవెలకుంట్ల: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న పవన్ కల్యాణ్(26) ఇదే పట్టణానికి చెందిన స్నేహితుడు శ్రీకర్‌రెడ్డితో కలిసి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం క్షేత్ర దర్శనానికి కోవెలకుంట్ల నుంచి బైక్‌పై ఈ నెల 11వ తేదీన బయలుదేరారు. శనివారం రాత్రి దర్శనం ముగించుకుని పుదుచ్చేరికి వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజామున బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. బైక్ నడుపుతున్న పవన్‌కల్యాణ్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. బైక్ వెనుక ఉన్న శ్రీకర్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్నేహితుడి మరణవార్తను కుటుంబ సభ్యులకు చేరవేయగా కుటుంబ సభ్యులు అక్కడికి బయలుదేరి వెళ్లారు. కాగా సుంకన్న, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కాగా ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో సుంకన్న మృత్యువాతపడ్డాడు. ఇప్పుడు ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కబళించడంతో తల్లి సుబ్బమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

ఊరంతా సంబరం

- కమనీయం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం
- ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవం
- ఆకట్టుకున్న కుడుములు ఆట, తన్నుల సేవ



పార్వతి, పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, వసంతోత్సవంలో గ్రామస్తులు

ఆస్పరి: చిన్నహోతూరు గ్రామంలో వెలసిన సిద్ధరామేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. సోమవారం నిర్వహించిన పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం, కుడుములు ఆట, నందికోలు, వీరభద్రస్వామి తన్నుల సేవ, వసంతోత్సవ సంబరాలతో గ్రామం కళకళలాడింది. కల్యాణం సందర్భంగా గ్రామస్తులు ఇరువర్గాలుగా విడిపోయి సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెళ్లి సమయంలో అలిగిన పార్వతీ దేవిని శాంతింప జేయడానికి పరమేశ్వరునిపై కుడుములు వేసి అవమానించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన పెద్దలు ఆడవేషంలో వున్న వ్యక్తిని శాంతింప జేస్తూ ఆటు ఇటు తిప్పుతూ బుక్కు పిండిని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఆ తర్వాత ఇరువర్గాల వారు కుడుములతో ఆడుకున్నారు. ఇరు వర్గాల పెద్దలు పెళ్లి ఒప్పందం చేసుకున్నారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహలను మేళతాళాలతో ఊరేగించారు. ఆ తరువాత ఆలయం దగ్గర వీరభద్ర స్వామి అవతారంలో వున్న పూజారి మహేష్ తలపై తట్ట పెట్టుకుని, త్రిశూలం చేత పట్టుకుని కేకలు వేసుకుంటు భక్తులను తన్నుతూ తిరగడం ఆకట్టుకుంది. ఆయన తన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. ఆయనతో తన్నించుకుంటే కోరిన కోర్కెలు వీరభద్రస్వామి తీర్చుతాడని భక్తుల నమ్మకం. అనంతరం ఉగ్రుడైన వీరభద్ర స్వామి అవతారిని గ్రామస్తులు మిరప కాయల పొగబెట్టి శాంతింపజేశారు. పార్వతీ, పరమేశ్వరుల పెళ్లి చేసే విషయంలో పార్వతీ తరుపున వచ్చిన పెళ్లి వారికి మర్యాదలు సరిగా చేయలేదని వీరభద్ర స్వామి ఉగ్రుడై గ్రామ పెద్దలను ఇలా తన్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు.


తన్నుల సేవలో వీరభద్ర స్వామి వేషధారి

అంతా గులాబీమయం

గ్రామస్తులు ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. ఉత్సవాలు సందర్భంగా ప్రతి గ్రామంలో ఏదో ఒక పండుగకు జరిగే వసంతోత్సవంలో రక రకాల రంగులు వాడుతారు. అయితే చిన్నహోతూరులో మాత్రం కులమతాలకు అతీతంగా ఒకే గులాబీ రంగును వాడటం ప్రత్యేకం. గ్రామంలో అన్ని వర్గాల వారికి సంబంధించి ఆరు పెద్ద రంగుల గుంతలు వున్నాయి. గుంతకో రంగుల కడవను ఆలయానికి తీసుకెళ్లి సిద్ధమేశ్వర స్వామికి పూజలు చేశారు. ఇక రంగుల చల్లుకోవడం ఆలయం నుంచి మొదలు పెట్టారు. ఆ తర్వాత ఒక గుంత రంగు పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ గ్రామం అంతా తిరుగారు. మహిళలు, పిల్లలు సైతం ఒకరిపై ఒకరు రంగులు వేసుకుని ఆనందోత్సవాలు మధ్య వేడుక జరుపుకున్నారు. పార్వతీ, పరమేశ్వరుల పల్లకీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయం చేరిన తరువాత వసంతోత్సవాన్ని ముగించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిక్రిష్ణ, గ్రామ పెద్దలు మంజునాథ్‌గౌడ్, వీరభద్రగౌడ్, బసవరాజు పాల్గొన్నారు.